అధైర్యపడకండి.. అండగా ఉంటాం

- పార్టీ యువజన విభాగం రాయలసీమ జోనల్ చైర్మన్ ప్రణయ్‌రెడ్డి



పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న యువనేత ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ: నియోజకవర్గంలో టీడీపీ నాయకులు రెచ్చిపోతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడుతున్నారని, ఎవరూ భయపడొద్దు.. అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తనయుడు, పార్టీ యువజన విభాగం రాయలసీమ జిల్లాల జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి ధైర్యం చెప్పారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో యువనేత ప్రణయ్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా యువనేత ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ ఉరవకొండలో పోలీసుల సమక్షంలోనే టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని, అయినా దాడి చేసేవారిపై ఎక్కడా చర్యలు తీసుకోలేదన్నారు. దాడులకు దిగడం మంచి పద్ధతి కాదన్నారు. పార్టీకి కష్టకాలంలో అండగా ఉన్న కార్యకర్తలకు గుండెల్లో పెట్టుకుంటామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతమయితే రెట్టింపుగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం..

ఈనెల 8న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి కార్యక్రమాలను అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు యువనేత ప్రణయ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహానేత విగ్రహానికి నివాళులర్పించి, సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, మాజీ ఎంపీపీ, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు బసవరాజు, జెడ్పీటీసీలు ఏసీ ఎర్రిస్వామి, తిప్పయ్య, ముష్టూరు సుంకన్న, పట్టణ నాయకులు ఈడిగ ప్రసాద్, ఆంజి, వెంకటేష్, ఆసిఫ్, శర్మాస్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు

పార్టీలకతీతంగా కలసికట్టుగా పనిచేద్దాం

- ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే కాలవ ప్రమాణం
- అజెండా, జీరో అవర్స్‌పై వాడీవేడిగా చర్చ



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం: సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి.. ఎన్నికలు ముగిసే వరకే రాజకీయాలు.. ఆతర్వాత అందరం కలసి కట్టుగా ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీలకతీతంగా పనిచేద్దామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సభ్యులకు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయం లో చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాలవ తొలుత ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ప్రమాణం చేశారు. అనంతరం అజెండాలోని 15 అంశాలపై చర్చించారు. ఇందులో 2, 3, 5 అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం లభించగా, మిగిలినవి వివిధ కారణాలతో పెండింగ్‌లో పెట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పోరాళ్ల గోవిందరాజులు, బండి అజయ్, పద్మజ, డిష్ గోవిందు, పైతోట సంజీవ, శ్రీలక్ష్మి, శ్రీనివాసరెడ్డి బడ్జెట్‌లోని అంశాలపై లేవనెత్తారు. మున్సిపల్ కార్యాలయంలోని ప్రధాన విభాగాల్లో ఖాళీలు ఉన్నారని, వాటిని భర్తీ చేశాకే బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం చైర్మన్‌తో సహా సభ్యులంతా ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడారు.. పార్టీ ఏదైనా అందరూ సభ్యులచేత ఎన్నికోబడిన వారేనన్నారు. ప్రజలకు మంచిచేసేందుకు అందరూ కలసికట్టుగా రావాలన్నారు. ప్రభుత్వం చేసే ప్రతి పనీ ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ముఖ్యంగా తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్యం మెరుగునకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిశోర్, తహసీల్దార్ చిట్టిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీ బాషా, ఆయా వార్డులకు చెందిన కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏకాగ్రతతో లక్ష్యాన్ని చేరుకోవచ్చు

- క్యాంప్ కమాండర్ కల్నల్ బీఎస్ ప్రసాద్



ఫైరింగ్‌లో శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కూడేరు: ఏకాగ్రతతో ఫైరింగ్ చేస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చని సీఏటీసీ–2 ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ బీఎస్ ప్రసాద్ అన్నారు. బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ–2 శిక్షణ ఇస్తున్నారు. శనివారం క్యాడెట్లకు ఫైరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. గురి తప్పినప్పుడు నిరుత్సాహపడకుండా ఆత్మవిశ్వాసంతో మళ్లీ ప్రయత్నిస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చని క్యాంప్ కమాండర్ తెలియజేశారు. ఫైరింగ్‌లో లక్ష్యాన్ని పూర్తి చేసిన క్యాడెట్లను ఆయన అభినందించారు. శిక్షణా తరగతుల్లో హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, సికింద్రాబాద్, కర్నూల్, గుంటూరు, విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, అనంతపురంగ్రూపులకు చెందిన 550 మంది క్యాడెట్స్, ఎన్‌సీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పంపిణీ



రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండ జైకిసాన్ ఫౌండేషన్, యాక్షన్ ఫెటర్నా ఎకాలజీ వారి సహకారంతో రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలను శనివారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబులేసు మాట్లాడుతూ ఏటా రైతులకు పండ్ల మొక్కలను ఉచితంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్నట్లు తెలిపారు. దానిమ్మ, సపోట, ఉసిరి, సీతాఫలం, జామ, నేరేడు మొక్కలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నాగమల్లి రజినీకుమారి, లావణ్య, సుందరేష్ పాల్గొన్నారు.

జోరుగా పారిశుధ్య పనులు

కంబదూరు: సీజనల్ వ్యాధులు వ్యాప్తించే అవకాశం ఉండడంతో ముందు జాగ్రత్తగా గ్రామ పంచాయతీలో పరిధిలోని గ్రామాల్లో సర్పంచ్ పద్మావతమ్మ ఆధ్వర్యంలో పారిశుధ్యం పనులు జోరుగా చేస్తున్నారు. శనివారం మండల కేంద్రంలోని వడ్డే కాలనీలోని పారిశుధ్య కార్మికులు మురుగు నీటి కాలువలను శుభ్రం చేయడంతో పాటు ఇళ్ల సమీపంలోని పేడ దిబ్బలు,చెత్తచెదారాన్ని తొలగించారు. రక్షిత మంచి నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు.

దోమ కాటుతో రోగాలు

కూడేరు: దోమకాటుతో మలేరియా, డెంగీ తదితర వ్యాధులు వస్తాయని ఎంఎల్‌హెచ్‌పీ మీనా తెలిపారు. శనివారం మండల పరిధిలోని చోళసముద్రంలో వైద్య సిబ్బంది, పంచాయతీ అధికారులు గ్రామ వీధుల్లో పర్యటించారు. ఇళ్ల ముందు అపరిశుభ్రత లేకుండా చూసుకోవాలని లేదంటే అందులో దోమలు వృద్ధి చెంది అవకాశముందని ఎంఎల్‌హెచ్‌పీ మీనా, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ ప్రజలకు తెలియజేశారు. దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


రేపు వైఎస్సార్ జయంతి

బెళుగుప్ప: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మచ్చన్న ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద వేడుకల్లో భాగంగా వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం అనంతరం కేక్ కత్తిరించి, పీహెచ్‌సీ వద్ద రోగులకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ జయంతి వేడుకలకు వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు కార్యకర్తలు అభిమానులు రైతులు పాల్గొనాలన్నారు.

విరివిగా వ్యవసాయ రుణాలు

రాయదుర్గం రూరల్: సహకార సంఘాల ద్వారా రైతులకు 50 శాతం వ్యవసాయ రుణాలు ఇస్తున్నట్లు 74 ఉడేగోళం సీఈఓ ఆంజనేయులు తెలిపారు. శనివారం సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన రైతులతో కలిసి సొసైటీ కార్యాలయ ఆవరణలో జెండా ఆవిష్కరించారు. అనంతరం రైతులతో ప్రతిజ్ఞ చేయించారు.

కోదండరాముడికి పూజలు



ప్రత్యేక అలంకరణలో సీతారాములు

కూడేరు: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భాస్కర్ శర్మ సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలకు తొలుత క్షీరాభిషేకం చేశారు. తర్వాత వివిధ రకాల పట్టువస్త్రాలు, పుష్పాలతో దేవతామూర్తులను అలంకరించారు. అనంతరం భక్తులకు అర్చకుడు తీర్థప్రసాదాలను అందించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



బొమ్మనహాళ్‌లో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు



కణేకల్లుక్రాస్‌లోని ఫర్టిలైజర్‌షాపులో మందులను పరిశీలిస్తున్న అధికారులు

కణేకల్లు/బొమ్మనహాళ్: కణేకల్లు క్రాస్, బొమ్మనహాళ్ మండలంలోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను వ్యవసాయ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడలో ఎర్రితాత ఆగ్రో ఏజెన్సీ డీలర్ షాపును ఏడీఏ భాస్కరయ్య, విజిలెన్స్ అధికారి విజయ్ తనిఖీలు చేశారు. స్టాక్ బుక్‌లోని వివరాలను తనిఖీ చేసి, రెండు కంపెనీల రూ.2,75,000 విలువజేసే విత్తనాలను అమ్మకాలను నిలిపివేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బొమ్మనహాళ్ ఏఓ సాయికుమార్, టెక్నికల్ ఏఓలు బాలానాయక్, రాకేష్‌నాయక్‌లు పాల్గొన్నారు.

శివగంగా ట్రేడర్స్ తనిఖీ చేసిన అధికారులు

కణేకల్లు క్రాస్‌లోని శివగంగా ట్రేడర్స్ (ఫర్టిలైజర్స్ షాపు)ను ఏడీఏ ఎం.భాస్కరయ్య, విజిలెన్స్ అధికారి విజయ్, ఏఓ శ్రవణ్‌కుమార్ తనిఖీ చేశారు. అనుమతి లేని రెండు కంపెనీల వివిధ రకాల మందుల విక్రయాలను నిలిపివేశారు. వీటి విలువ రూ.16,900 ఉంటుందన్నారు. అనుమానాస్పద మందుల శ్యాంపిల్స్‌ను సేకరించి, సెంట్రల్ ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన ఎరువులు, మందులు, విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించాలని అధికారులు సూచించారు. ప్రతి దుకాణం వద్ద ధరల పట్టిక ప్రదర్శించాలని ఏడీఏ ఆదేశించారు. కార్యక్రమంలో జేడీఏ కార్యాలయ సిబ్బంది రాకేష్‌నాయక్, బాలునాయక్ పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: శ్రీ కనకదాస ఉద్యోగ, ఉపాధ్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో అందించనున్న ప్రతిభా అవార్డులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఉపాధ్యాయులు కే నాగరాజు, పాండురంగ, కారుమంచి, జేకే శివశరణ శనివారం తెలిపారు. పదో తరగతిలో 450, ఇంటర్‌లో 850పైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించిన కురుబ విద్యార్థినీ, విద్యార్థులు మాత్రమే అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సీబీఎస్‌ఈలో 75 శాతం మార్కులు సాధించిన వారు కూడా అర్హులన్నారు. ఈనెల 15 లోపు మార్కుల జాబితా, ఫోన్ నంబర్ ఇతర వివరాలతో 9492552915, 9441668105, 9441860721, 9490274982 నంబర్లకు వాట్సాప్ చేయాలని వారు తెలియజేశారు.

ఆర్థిక సాయం

శెట్టూరు: మండలంలోని మాకోడికికి చెందిన శంకరప్ప కుమారుడు ఆదిత్య చికిత్స కోసం ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ చికిత్స కోసం రూ.10వేలు ఆర్థిక సాయం శనివారం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీష్, ఓబులేష్, రాము, చిరంజీవి పాల్గొన్నారు.

కణేకల్లులో విజృంభిస్తున్న డయేరియా

కణేకల్లు: కణేకల్లులో డయేరియా విజృంభిస్తోంది. డయేరియా బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కొందరు అతిసార బాధితులు ప్రభుత్వాస్పత్రితోపాటు ఆర్డీటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొందరు ప్రైవేట్ క్లినిక్‌లకెళ్లి చూపించుకుంటున్నారు. కణేకల్లు ప్రభుత్వాస్పత్రిలో రోజూ ఐదారు డయేరియా కేసులు నమోదవుతున్నాయి. ప్రైవేట్ క్లినిక్‌లలో పదికి పైగా కేసులు నమోదవుతున్నాయి. శనివారం తాజాగా సోమశేఖర్ (25), నాగప్ప (59), గులాబీ (55), షేక్ మునీరా (24), గౌరమ్మ (52), లతీఫ్ (60) వాంతులు, విరోచనాలతో కణేకల్లు ప్రభుత్వాస్పత్రిలో చేరారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం



డయేరియాపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: డయేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారులు గీతాభార్గవి, కుమారరాజా సూచించారు. శనివారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి, డయేరియాపై అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భగా వైద్యులు మాట్లాడుతూ డయేరియాను నిర్లక్ష్యంగా చేస్తే ప్రమాదకరంగా మారుతుందన్నార. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తి గత పరిశుభ్రత పాటించడం ద్వారా డయేరియాను పారదోలాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, ఆరోగ్య కార్యకర్త వెంకటరమణ, ఎర్రమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు పూజలు



ప్రత్యేక అలంకరణలో నేమకల్లు అంజన్న

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామంలో ప్రసిద్ధి చెందిన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక జలంతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

సీతారామస్వామి ఆలయంలో పూజలు



వజ్రకరూరులో అలంకరణలో జనార్దన వెంకటేశ్వరస్వామి

వజ్రకరూరు: స్థానిక బలిజవీధిలో వెలసిన సీతారామ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామికి అర్చనలు, మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెంపుడు జంతువులకు టీకాలు



ఉరవకొండలో పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న ఏడీఏ డాక్టర్ వెంకటేశులు



బెళుగుప్ప పశువైద్య కేంద్రంలో టీకా వేస్తున్న పశువైద్యాధికారి రమేష్



కళ్యాణదుర్గంలో కుక్కకు టీకా వేస్తున్న ఏడీఏ శ్రీనివాస్‌గుప్త

బొమ్మనహాళ్: పెంపుడు కుక్కలు, పశువులతో జాగ్రత్తగా ఉండాలని పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు.శనివారం స్థానిక పశువైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలు, పశువులు ఉన్న వారికి అవగాహన కల్పించారు. అనంతరం వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకా వేశారు.

రేబిస్ టీకా కార్యక్రమం

ఉరవకొండ: ఉరవకొండ పశుసంవర్ధక శాఖ కార్యాలయం వద్ద పెంపుడు జంతువులకు ఉచిత రేబీస్ వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం శనివారం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ వెంకటేశులు మాట్లాడుతూ ఇంట్లో పెంచుకునే జంతువులు, పశుపక్షాదుల నుంచి మనషులకు 180 రకాల రోగాలు సంక్రమించే అవకాశం ఉందన్నారు. ఈవ్యాధులు సంక్రమించకుండా ప్రజలను అప్రమత్తం చేయడానికి ఏటా జూనోసిస్ డే నిర్వహిస్తామన్నారు. ఉరవకొండ పశు సంవర్ధక శాఖ డివిజన్ పరిధిలో 5,400 రేబీస్ టీకాలను పెంపుడు జంతువులకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూనోటిక్ వ్యాధిపై అవగాహన

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనోటిక్ వ్యాధిపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీఏ శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ పెంపుడు జంతువులతో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ముందస్తుగా టీకా వేయించుకుంటే వ్యాధులను అరికట్టొచ్చని తెలిపారు. అనంతరం 62 కుక్కలకు జూనోటిక్ వాధిపై నివారణ టీకా వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు రామమూర్తి, వెంకటరమణ, గుల్షాద్ బేగం, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

రేబీస్ వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం

బెళుగుప్ప: మండల పరిధిలోని మూడు పశు వైద్య శిబిరాల ద్వారా ఉచితంగా పెంపుడు కుక్కలకు ఉచిత రేబీస్ వ్యాధి నిరోధక టీకా వేసినట్లు పశువైద్యాధికారి రమేష్ శనివారం తెలిపారు. బెళుగుప్ప పశు వైద్య కేంద్రంలో 24 పెంపుడు కుక్కలు, గంగవరం, శీర్పికొట్టాల పశు వైద్య కేంద్రాల్లో 42 పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాధి నిరోధక టీకా వేశారు.

జూనోసిస్ డే

శెట్టూరు: మండల పశువైద్యశాలలో శనివారం జూనోసిస్ డే నిర్వహించారు. ఏడీ నాగలింగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు టీకా వేశారు. ఏఆర్వీ వాక్సిన్ కుక్కలకు అందించినట్లు తెలిపారు. అనంతరం పెంపుడు కుక్కలతో యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు నాణ్యతగా చేయాలి



మాట్లాడుతున్న డ్వామా ఏపీడీ విజయలక్ష్మి

వజ్రకరూరు: ఉపాధి హామీ పనులు నాణ్యతగా చేయాలని డ్వామా ఏపీడీ విజయలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం డ్వామా ఏపీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ 2024–25ఆర్థికసంవత్సరానికి సంబంధించి మండల వ్యాప్తంగా మొత్తం 1819 పనులు మంజూరయినట్లు తెలిపారు.వీటిలో 1,717 పనులు ప్రారంభించగా, 102 పనులు పూర్తయినట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.7.8 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అందులో రూ.6.20 కోట్లు కూలీలకు చెల్లించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 11,623 జాబు కార్డులు ఉండగా, 18,712 మంది కూలీలు ఉన్నారన్నారు. ఉపాధిహామీ కింద వ్యవసాయ పొలాల్లో ఫారంఫండ్ ,పంటకాలువలు, హార్టికల్చర్ పనులు చేసినట్లు తెలిపారు. ఏపీఓ లక్ష్మీ కాంతబాయి తదితరులు పాల్గొన్నారు.


దాయాదుల మధ్య ఘర్షణ



అనిల్‌కుమార్

రాయదుర్గం(డి హీరేహాళ్): డీ హీరేహాళ్ మండలంలోని మురడిలో భూవివాదంలో దాయాదుల మధ్య శనివారం ఘర్షణ జరిగింది. కమ్మరి పురుషోత్తం, కుమారుడు కమ్మరి అనిల్‌కుమార్‌పై సోదరుడు సర్పన్న, కుమారులు శాంతి, అభి దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడు అనిల్‌కుమార్ తెలిపిన మేరకు.. తాత హనుమంతప్పకు శాంబవి, కాశమ్మ అనే ఇద్దరు భార్యలు అని, వారికి ఇద్దరు సంతానం. ఇద్దరికి మొత్తం 11.02 ఎకరాలుంటే సగం భూమి పంచుకున్నారు. అయితే మాకు చెందాల్సిన 5.51 ఎకరాలు కూడా మా చిన్నాన్న పట్టా చేయించుకున్నాడని, అనిల్‌కుమార్ తెలిపాడు. దీంతో తాము కోర్టుకు వెళ్లామన్నారు. అయితే టీడీపీ అధికారంలోకి రావడంతో ఓ నాయకుడి అండచూసుకుని పొలం దున్నేందుకు వచ్చారన్నాడు. అడ్డగించిన తమపై చిన్నాన్నా, అతడి కుమారులు కర్రలు, రాళ్లతో దాడిచేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చింది.. భూమిలోకి వస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని అనిల్ కుమార్ వాపోయాడు. ఈవిషయంపై స్థానిక పోలీసులతో పాటు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు.

గురుకులం ఆవరణలో అపరిశుభ్రత



పాఠశాల ఆవరణలో పారుతున్న మురుగునీరు

కంబదూరు: ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకోవాల్సిన విద్యార్థినులు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. పాఠశాల సిబ్బంది పట్టించుకోకపోవడంతో విద్యార్థినులు రోగాలబారిన పడుతున్నారు. వివరాలు.. మండలంలోని తిమ్మాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో హాస్టల్ నుంచి వ్యర్థపు నీరు బయటకు వెళ్లకుండా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అడ్డుకట్ట వేశాడు. దీంతో పాఠశాల ఆవరణ అంతా అపరిశుభ్రత నెలకొంది. మురుగు కాలువను తలపిస్తోంది. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులను చేసేందుకు వచ్చిన తల్లిదండ్రులు ఈ దుస్థితిని గమనించి ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. శనివారం ఎస్సీ, ఎస్టీ జేఏసీ మండల అధ్యక్షుడు రమేష్ తన కమిటీతో వెళ్లి పాఠశాల ఆవరణలో అధ్వానంగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాల ఆవరణలో మురుగు నీరు ప్రవహిస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోందని, భోజనం కూడా తినలేకపోతున్నామని విద్యార్థినులు వాపోయారు. దోమలు కూడా విజృంభిస్తున్నాయని, జ్వరాలు, వాంతులు,విరేచనాలతో బాధపడుతున్నట్లు తెలిపారు. గతంలో సమస్యను డీసీఓ, ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లినా డ్రైనేజీ సమస్య పరిష్కరించలేదని ఎస్సీ,ఎస్టీ జేఏసీ అధ్యక్షుడు రమేష్ తెలిపాడు.

సహకార సంఘం దినోత్సవం

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని భైరవాని తిప్ప సహకార సంఘం కార్యాలయంలో సహకార సంఘం దినోత్సవం శనివారం నిర్వహించారు. సహకార సంఘం జెండాను ఆవిష్కరించారు.

ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

రాయదుర్గం రూరల్: 2024–25 విద్యాసంవత్సరం స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి తెలిపారు. శనివారం ఆయన కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 10న ఆఖరి రోజు అని, 11న వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలన్నారు. 19న సీట్ల కేటాయింపులు ఉంటాయన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, బీఏ, బీకాం, బీఎస్సీలో సింగిల్ మేజర్ సబ్జెక్టులు ఎకానమిక్స్ , పొలిటికల్ సైన్స్ , స్పెషల్ తెలుగు, కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్, మైక్రోబయాలజీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, బాటనీ కోర్సులు ఉన్నాయన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు సెల్: 9030260294, 9989660435, 9738404413, 9398617197లో సంప్రదించాలన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

వజ్రకరూరు: మండలంలో వ్యవసాయ పొలాల్లో రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ మధుకర్ కోరారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓ మాట్లాడుతూ మండలంలో 2024 -25 సంవత్సరానికి 410 మట్టి నమూనాలు సేకరించినున్నట్లు తెలిపారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కళ్యాణదుర్గం రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పెంచాలని కళాశాల ప్రిన్సిపాల్ జయరాం , పట్టణ సీఐ హరినాథ్ తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం కళాశాలలో ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

బాధ్యతగా మొక్కలు పెంచాలి

వజ్రకరూరు: మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేపట్టాలని ఎంపీడీఓ విజయలలిత, ఏపీఎం గుణశ్యాం అన్నారు. శనివారం వజ్రకరూరులోని వెలుగు, ఎంపీడీఓ కార్యాలయాలఆవరణలో హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. టేకు, ఎర్రచందనం, రావి, నేరేడు తదితర మొక్కలు నాటి నీరు పోశారు.